# శేషయ్య శిష్యరికం

గండు సుబ్రహ్మణ్యదీక్షితులు



శ్రీసూక్తమూ, పురుషసూక్తమూ పారాయణ అయిపోయి, సౌందర్యలహరి శ్లోకాలు పాడటంలో లీనమయ్యాడు కంఠార్కశాస్త్రి. తొడల మీదికి పంచె ఎగగట్టి, జంధ్యాల దారానికి పురిపోస్తూ అతను తన పెంకుటింటి వసారాలో పచార్లు చేస్తున్నాడు. పొద్దున్నే అవ్వవలసిన స్నానమూ, సంధ్యావందనమూ అయిపోయాయనే విషయాన్ని అతని నుదుటిమీద, రొమ్ముమీద మెరుస్తున్న విభూతి రేఖలే చెప్తున్నాయి. అతని పౌరోహిత్యం కింద ఉన్న పదిహేను, ఇరవై ఊళ్ళల్లోనూ ఆనాడు అతను చేయించవలసిన శుభకార్యం ఏదీ లేకపోవటంచేత అతను తీరుబాటుగా జంధ్యాలు వడకటంలో నిమగ్నమయ్యాడు.

వీధి తలుపులు తోసుకుని పదిహేను, పదహారేళ్ళ కుర్రాడొకడు లోపలికొచ్చాడు. నిక్కరు, చొక్కా, పైమీద తుండులతో ఉన్నాడతను. మొహంలో బ్రహ్మవర్చస్సు తొంగి చూస్తోంది. వసారా దగ్గరకొచ్చి కంఠార్కశాస్త్రి నుద్దేశించి "నమస్కారమండి" అన్నాడు.

శాస్త్రి, "ఎవరు నాయనా, ఏం కావాలి?" అన్నాడు.

"మాది కామవరపు కోటండి. పద్మనాభ శాస్త్రిగారబ్బాయిని – నన్ను శేషయ్యంటారండి"

"ఏ పద్మనాభ శాస్త్రిగారు? ... సరేలే. వచ్చి అట్లా చాపమీద కూర్చో."

శేషయ్య బిరుగ్గా వెళ్ళి వసారాలో తాటాకుల చాప మీద తలవంచుకుని కూర్చున్నాడు. రెండు నిమిషాల తర్వాత శాస్త్రి, "ఏం కావాలో చెప్పు నాయనా" అన్నాడు.

నీళ్ళు నములుతున్నట్లు శేషయ్య అన్నాడు: "మాది ఏమీ లేని కుటుంబమండి. మా నాన్నగారు నా చిన్నప్పుడే పోయారు. ఊళ్ళోవాళ్ళ సహాయంతో మా పెదనాన్నగారు ఎట్లాగో నన్ను పది దాకా చదివించారు. ఇంక చదివించలేనంటున్నారు. నా కింద ఇంక ఇద్దరు తమ్ముళ్ళూ, ఒక చెల్లీ ఉన్నారండి. మేము బతకటానికి నేను పౌరోహిత్యం చెయ్యటం తప్ప ఇంకో మార్గం నాకు కనిపించడం లేదండి. మీరు గొప్ప పండితులనీ, నియమ నిష్ఠలతో పౌరోహిత్యం చేసేవారనీ మా పెదనాన్నగారు చెప్పారు. ఆ మంత్రాలు మీ దగ్గర నేర్చుకోవాలని నాకు కోరికగ వుంది. అది అడగాలనే వచ్చాను."

శాస్త్రి నవ్వాడు అన్నాడు: "పౌరోహిత్యం నేర్చుకుంటావా నాయనా! అది ఎంత ప్రమాదకరమైన వృత్తో తెలుసా? మంత్రాలు ఉచ్చరించడంలోనూ, తంతు నడిపించటంలోనూ తెలిసో తెలియకో నువ్వు చేసే తప్పులకే కాక, యజమాని చేసే తప్పులకు కూడా నువ్వే బాధ్యుడవవుతావు. వెరసి పాపం మొత్తం నీకే సంక్రమిస్తుంది. ఎన్నో నీతి నియమాలతో జీవిస్తేనే కాని ఈ వృత్తిలో నెగ్గుకురావటం కష్టం. సాధారణంగా ఈ వృత్తిలో వున్నవాళ్ళకు వంశాల విలువ నాయనా! మీ పెదనాయనగారు నిన్నెట్లా ప్రోత్సహించారో ఆయనకే తెలియాలి! ఏ చిన్నదో ఒక ఉద్యోగమే నీకు మంచిది."

"పదో క్లాసుకు వచ్చే ఉద్యోగాలన్నీ ఇతర కులాలవాళ్ళకే రిజర్వేషన్ చేస్తున్నారు కదండీ! నాకెట్లా వస్తుందండీ ఉద్యోగం?"

శాస్త్రి నిట్టూర్చాడు: "దేశంలో ఏం జరగనున్నదో ఆ పరమేశ్వరుడికే తెలియాలి!.. ఆఁ, చూడబోతే తెలివిగలవాడిలాగా కనిపిస్తున్నావు. నీకు ఈ వృత్తి మాత్రం మంచిది కాదు బాబూ!"

"మంచిదో చెడ్డదో, నాకు ఇది తప్ప వేరే గతి లేదండి. ఇదయినా ఈ ఊళ్ళో మా దూరపు బంధువులున్నారు కాబట్టి, వాళ్ళింట్లో ఉండి మీదగ్గర చదువుకోగలను

# శేషయ్య శిష్యరికం

కాని. ఇంకో ఊరు, ఇంకో ఊరయితే నాకీ అవకాశం కూడా ఉండేది కాదు.''

గొంతులో విసుగు ధ్వనించగా శాస్త్రి అన్నాడు: ''ఇంత చెప్పినా నీ పట్టే పట్టుకుంటావేమిటి? అసలింకో ముఖ్య విషయం ఉంది. ఈ పెద్ద మంత్రాల ఉచ్చారణా అవీ సరిగ్గా రావాలంటే ముందు అమరకోశం, శబ్దమంజరీ క్షుణ్ణంగా రావాలి, తెలిసా?''

''అమరం కొంతా, శబ్దమంజరి కొంతా, రామాయణ సంగ్రహం పూర్తిగానూ మా పెదనాన్నగారు నాకు చెప్పారండి.''

శాస్త్రి శేషయ్య వైపు చురుగ్గా చూసాడు దారం పురెక్కిస్తూనే అన్నాడు: 'అసలు నువ్వు ముందర మూడు పూటలా సంధ్యావందనం చేసేవాడివి అవ్వాలి. అది కూడా స్వరంతో రావాలి.''

''మూడు పూటలా చేస్తానండి. కానీ, స్వరం చెప్పుకోలేదండి.''

''అసలు తప్పుల్లేకుండా వచ్చునని హామీ ఏమిటయ్యా?... ఏదీ, మధ్యాహ్నంవేళ సూర్యుడికి అర్ఘ్యప్రదానం ఇచ్చే మంత్రం ఒక్క గుక్కలో చెప్పు!''

''కాళ్ళు కడుక్కొని రావాలి గదండీ!''

''సరే. అదిగో నీళ్ళు''

శేషయ్య కిందికి దిగి వెళ్లి తొట్టిలో నీళ్లతో కాళ్ళూ కళ్ళూ కడుక్కొచ్చాడు తుండుతో తుడుచుకొని బాసిక పట్టు వేసుకొని కూర్చున్నాడు. మంత్రం చెప్పాడు. మెప్పుకోలు కోసం ఆశగా శాస్త్రి వైపు చూస్తూ ''తప్పులున్నాయాండీ?'' అన్నాడు.

శాస్త్రి తప్పదన్నట్లు మొహం పెట్టి, ''ఊఁ, ఏదో చెప్పావులే ఎన్ని చెప్పినా నువ్వు ఇంకో వృత్తి చూసుకోవటమే మంచిది'' అన్నాడు. దారానికి పురెయ్యటం అయిపోగా, పంచె అంచులు కిందికి జార్చి కదురుతో ఇంట్లోకి వెళ్లబోయాడు

శేషయ్య హఠాత్తుగా లేచి వెళ్ళి శాస్త్రి కాళ్ళు పట్టుకున్నాడు. ''గురువుగారూ, నాకు స్మార్తం చెప్పండి. మీరు ఎట్లా చెబితే అట్లా చదువుకుంటానండి. మా ఇంట్లో ఇప్పటికే పస్తులు పడుతుంటున్నామండి నేను తొందరగా సంపాదించకపోతే అందరం చచ్చిపోతామండి... ఏమండి...'' శేషయ్య గొంతు గద్గదికమయింది.

శాస్త్రి కుర్రాడి మొహంలోకి చురుగ్గా చూసాడు. నాలుగైదు క్షణాలు ఆగి అన్నాడు. ''డబ్బు గిట్టుబాటు తక్కువ, పాపం గిట్టుబాటు ఎక్కువ. వచ్చి వచ్చి ఈ రొంపిలో పడతానంటావేమిట్రా నాయనా!... సరే, పై ఆదివారం మీ పెదనాన్నతో వచ్చి కనిపించు. పో!'' శాస్త్రి లోపలికి వెళ్ళిపోయాడు

శేషయ్య, ''అట్లాగేనండి'' అని పై తుండుతో కళ్ళు ఒత్తుకుంటూ బయటికి నడిచాడు

* * *

పై ఆదివారం శేషయ్య రాలేదు. ఆ తర్వాత వారానికల్లా అతను కంఠార్క శాస్త్రిని కలవటం జరగలేదు ఆ కలవటం కూడా శాస్త్రి ఎక్కడెక్కడో తిరిగి తిరిగి వచ్చి, స్నానంచేసి, జపం చేసుకుని, సరిగ్గా భోజనానికి కూర్చోబోయే సమయంలో జరిగింది. ఎండనపడి వచ్చిన విసుగూ, కడుపులో ఆకలీ– ఈ రెండింటి తాలూకు బాధనీ శేషయ్య మీద ఒక్కుమ్మడిగా కుమ్మరించాడు శాస్త్రి: ''బుద్ధిహీనుడా, నీ ఇష్టం వచ్చినప్పుడు రావటానికి ఇదేమన్నా నాటకశాల అనుకున్నావా? మీ పెదనాన్నతో పోయిన ఆదివారం రమ్మంటే ఇవాళ ఒక్కడివీ ఊపుకుంటూ వచ్చావా! చెప్పిన పని చెప్పినట్టు చెయ్యటమనే చిన్న నియమాన్ని పాటించలేని వాడివి రేపు వృత్తిలో పెద్దపెద్ద నియమాల్ని ఎట్లా పాటిస్తావు? వృత్తి గౌరవాన్ని ఎట్లా కాపాడతావు? పరీక్షలో ఓడావు పో! ఇక నేను చెప్పనూ లేను నీకది రానూ రాదు'

శేషయ్య దిమ్మరపోయాడు. కొన్ని క్షణాలు అట్లా చూస్తూ ఉండిపోయి చివరకు నూతిలోంచి మాట్లాడుతున్నట్లు అన్నాడు: ''క్షమించండి – నేను వద్దామని ఎంతో ప్రయత్నం చేసానండి. కాని మా పెదనాన్నగారికి హఠాత్తుగా జ్వరం వచ్చి మంచంలో పడటంచేత అప్పట్నుంచీ ఇంత వరకూ ఇల్లు కదల్లేకపోయానండి. ఇవాళ కూడా నేను రాగలిగే పరిస్థితి కాదండి కాని మీరు నా గురించి ఇంకోవిధంగా అనుకుంటారేమోనని వచ్చానండి.'' అతని గొంతులో ఏడుపుజీర ధ్వనించింది

''ఉద్ధరించకపోయావ్! వెళ్ళు, వెళ్ళు!'' శాస్త్రి గిరుక్కున వెనక్కు తిరిగి ఇంట్లోకి వెళబోయాడు.

ఇంతలో, 'నమస్కారమండీ, పంతులు గారూ!'' అన్న మాటలు విని శాస్త్రి వెనక్కుతిరిగాడు. ''ఓహో నువ్వటయ్యా, వెంకటరెడ్డీ!.. నేను పెట్టిన ముహూర్తానికి నీ వియ్యంకుడు ఒప్పుకున్నట్టేనా?''

ఆ వచ్చిన వెంకటరెడ్డి చేతులుజోడిస్తూ, ''చిత్తం, చిత్తం. తమరు ముహూర్తం పెట్టటమేంటి. అల్లా ఒప్పుకోకపోట మేంటి! తమరి ఆశీర్వాదంవల్ల ఇంతవరకూ అన్నీ సానుకూల పడ్డాయండి. శుభలేక వేయించటమే ఆలీసమండి. పెళ్లిసంబారాలు కూడా ఏయేంగావాలో రాసిస్తే అన్నీ ఈ యేళే కొనుక్కెళ్లిపోతానండి. మరి యేం గావాలన్నా ఈ ఊళ్లోనే కొనుక్కోవాలిగాని. మా ఊళ్లో దొరకవు గదండి''

''సరేరా, కూర్చో. నిన్ను పంపించాకనే భోంచేస్తాను,'' అంటూ శాస్త్రి ఇంట్లోనుంచి పెన్నూ, కాగితమూ తెచ్చుకొని గబగబా వస్తువుల జాబితా రాసేసి రెడ్డికిచ్చాడు. ''పుల్లయ్యగారి కొట్లో కెళ్ళి నేను చెప్పానని చెప్పు. అన్నీ ఒకటోరకంవి ఇస్తాడు'' అన్నాడు.

జాబితా అందుకొని రెడ్డి లేచాడు. అన్నాడు: ''అయ్యా, వచ్చేనెల రెండో శుక్రవారం రాత్రికి పెళ్లి కనక మధ్యాహ్నానికే

## కాబరే

గాలి
వెస్టర్న్ మ్యూజిక్
హోరెత్తిస్తుంటే–
చెట్లు
గుడ్డలూడదీసుకొని
నాట్యం చేస్తుంటే–
సిగ్గుపడిన చంద్రుడు
మేఘాల చాటున
దాక్కుంటుంటే–
ప్రకృతి
అవహేళన చేస్తోందని
ఆకాశం
మౌనంగా నవ్వుకుంది
అచ్చం
భారతీయ సంస్కృతిలా !!!

— రామసూరం.

తమరికోసం మా ఎడ్లబండి పంపిస్తానండి. మా వూళ్లో పోష్టు పంతులుగారింట్లో తమరికి సొంత వంటకి ఏర్పాటు చేసానండి. తమరొచ్చి, ఆ రాత్రికి మా యబ్బాయికి పెళ్లి చేయించి, ఆ మర్నాటి కూడా అక్కడే వొండుకొని తిని, నన్నూ మా యావిడ్నీ సంతోష పెట్టాల!''

"ముహూర్తం పెట్టమన్నావు, పెట్టాను. చేయించటానికి ఇంకెవర్నయినా తీసికెళ్లగూడదుటయ్యా! నేనే కావాలా?"

"అహాహా, అట్టా అంటే కుదర్దండి పంతులుగారు తమరు సాక్షాత్తు బ్రహ్మంగారే. తమరే రావాల, నా కొడుకు పెళ్లి చేయించాల! నా వొంశెం బిడ్డ బిడ్డ తరాన పచ్చగా సాగిపోవాల! అసలు మీరు మంత్రం చెబుతా ఉంటే సంగీతం యిన్నట్టుగ దండి! సదూరాని నాకూడా అంతా అర్థం అయినట్టే ఉంటాది గదండి! తమర్లో ఎంత మహత్యం లేకపోతే ఈ చుట్టుపట్ల యిరవై వూళ్లొళ్లందరూ పెళ్లి పనికి తమర్నే పిలుస్తారండి! తమరికిప్పుడీల్లేకపోతే, యిలాగు వచ్చాడే వొచ్చి పెళ్లిచేయిచ్చండి... అమ్మమ్మ. తమరు రాకపోతే కుదర్దండోయ్!'

"ఓరి నీ అసాధ్యం గూలా, ఎంత పట్టు పట్టావయ్యా! మొత్తానికి పెద్దరెడ్డివని పించుకున్నావు. సర్లే వస్తాన్లే."

"చిత్తం, మరయితె యెళ్లొస్తానండి"— రెడ్డి వెళ్లబోయి, పక్కనున్న శేషయ్యవైపు చూస్తూ "యీయనెవరండి పంతులు గారూ?" అన్నాడు

"అతనా, బ్రాహ్మలబ్బాయే లే. మంత్రాలు నేర్చుకోటానికి వచ్చాడు."

"మంచి గురూగార్ని పట్టావులేవయ్యా పంతులూ?.. మరయితే యెళ్లొస్తానండి"— వెంకటరెడ్డి వేగేగంగా బయటికి నడిచాడు.

శాస్త్రి, లోపలికి వెళ్లబోయినవాడల్లా వెనక్కు తిరిగి, శేషయ్యతో, "చూసావా అబ్బాయా, బ్రాహ్మల-ఇళ్లల్లో చేయించి నట్టుగ ఇట్లాంటి ఊరి పెద్దల ఇళ్లల్లో పెళ్లిళ్లు చేయించటం కుదర్దు. పామూ చావకూడదు, కర్రా విరగకూడదన్నట్టు, మంత్రలోపం జరక్కుండా, వాళ్లకు విసుగు రాకుండా కార్యం జరిపించాలంటే కత్తిమీద సాము చెయ్యటమే! దీనికి కొంత లౌక్యం కూడా అవసరం. చూడబోతే నీకు తెలివైతే ఉందిగాని, లౌక్యం తక్కువల్లే ఉంది. స్పష్టంగా ఇంగ్లీషు ముక్కలు చదివావన్నావు, ఈ మంత్రం ముక్కలు నీకు నోరు తిరుగుతాయా? నాలుగు అమరంశ్లోకాలూ, సంధ్యా వందనమూ రాగానే సరిపోతుందా? వెళ్లు, నాయనా వెళ్లు. నువ్వు ఈ వృత్తిలో నెగ్గుకు రాలేవు. దొరికిందేదో ఒక ఉద్యోగమే నీకు మంచిది. మళ్లీ ఎన్నడూ ఈ విషయమై నా దగ్గరకు రాకు!"— శాస్త్రి లోపలికి వెళ్లిపోయాడు.

దిగాలు పడుతుకుని వడిలిపోయిన మొహంతో శేషయ్య వీధిలోనికి నడిచాడు.

* * *

శుక్రవారం ఇంకా రెండు రోజులున్న దనగా కంఠార్కశాస్త్రి భార్యకు హఠాత్తుగా పక్షవాతం వచ్చి ఆమె మంచాన పడింది. శాస్త్రి కూతుళ్లు కుటుంబాలు దూర ప్రాంతాల్లో ఉన్న కారణంగా, అతనే దగ్గరుండి ఆవిడకు సేవలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది పరామర్శకోసం వచ్చేపోయే వాళ్లతో ఇల్లు నిండిపోసాగింది ఈ హడావుడి కంగారుల్లో శాస్త్రి, వెంకటరెడ్డి ఇంట్లో పెళ్లివిషయం మరిచేపోయాడు.

సరిగ్గా శుక్రవారంనాడు రెడ్డి పంపిన ఎడ్లబండివచ్చి వాకిట్లో నిలిచే సమయానికి, శాస్త్రి భార్య అవసాన దశకు చేరుకుంది శాస్త్రి, పుట్టెడు దుఃఖంలో భార్య మంచం పక్కన కూర్చొనున్నాడు.

ఎవరో లోపలికి వచ్చి శాస్త్రితో, "మీకోసం రెడ్డిగారు బండి పంపించాడు" అని చెప్పగా, "నేను రాలేనని, ఇంకెవర్నయినా చూసుకోమని చెప్పండి" అన్నాడు శాస్త్రి

అదే సమయానికి వీధిలో వెళుతున్న శేషయ్య, శాస్త్రి ఇంట్లో జనం గుమిగూడి ఉండటాన్నిచూసి, లోపలికొచ్చి విషయం అర్థం చేసుకున్నాడు. బండివాడితో శాస్త్రి చెప్పమన్న కబుర్ను తాను చెబుతానని ఆ వ్యక్తితో అని, బయటికొచ్చి బండి వాడితో "చూస్తున్నావుగ మా గురువుగారి కొచ్చిన కష్టం! ఆయన తన బదులు నన్ను వెళ్లి పెళ్లి చేయించమన్నారు - పదపోదాం!" అన్నాడు.

కొంతసేపటికి, వెంకటరెడ్డి కొడుకు పెళ్లి చేయించే బ్రహ్మగా శేషయ్యను ఎక్కించుకొని ఎడ్లబండి, నాటురోడ్డుమీద సాగిపోతోంది.

* * *


రెండు రోజులు గడిచాయి.

ఆదివారం నాడు "శాస్త్రిగారు అర్జంటుగా రమ్మన్నార"నే కబురందుకొని, శేషయ్య నుంచున్నపళంగావచ్చి శాస్త్రి ఎదుట వాలాడు.

అక్కడ శాస్త్రి పక్కన చాపమీద పావు మూట బియ్యమూ, బుట్టెడు కూరగాయలూ, కొత్త పంచెలచాపూ, ఆ చాపు మడతలో యాభై రూపాయల నోట్లూ ఉన్నాయి శాస్త్రి మొహంలో కోపం తాండవిస్తోంది. కళ్లు ఎరుపెక్కిపోయి ఉన్నాయి.

శేషయ్య నమస్కారం పెట్టాడు.

శాస్త్రి: "దొంగ నమస్కారాలకేంలే,



# శేషయ్య శిష్యరికం

ముందిది చెప్పు... నేను పంపించావని చెప్పి వెళ్ళి మన్య చేయించావటగా పెళ్ళి?''

శేషయ్య : ''అవునండి.''

శాస్త్రి : (కోపాన్ని అణుచుకుంటూ) ''నీకు విఘ్నేశ్వరపూజే రాదన్నావే, పెళ్ళి ఎట్లా చేయించావు?''

శేషయ్య : ''మా నాన్నగారు నాకు నేర్పిన స్తోత్రాలూ, అష్టకాలూ చదివానండి. నాకొచ్చిన అమరం శ్లోకాలు కూడా వాడానండి. నా నోటికొచ్చింది చదువుతూ, చేతికొచ్చింది చేయిస్తూ, మూడు ముళ్ళూ వేయించానండి.''

శాస్త్రి : (ఆవేశంగా) ''అంటే నీకొచ్చిన శ్లోకాల్ని, 'అహం, ఉహుం' శబ్దాల్తో ముక్కుతో పలికి మంత్రాలుగా చెలామణీ చేసేసావన్నమాట! అక్కడున్న యావన్మంది జనానికీ ముసుగుకప్పి మోసం చేసేసావన్న మాట! ఇదంతా తప్పని తెలిసేచేసావా?'

శేషయ్య : ''అవును తెలిసే చేసాను.''

శేషయ్య గొంతులో మనిషి దెబ్బతిన్న ఛాయలు తొంగి చూస్తున్నాయి శాస్త్రి కోపం కక్కాడు. అన్నాడు :

''ఓరి అప్రాచ్యుడా! నీ వంశం, దాని పచ్చదనం సంగతి అట్లా ఉంచు. నీమటుకు నువ్వు బతికి బట్ట కట్టదలుచుకోలేదేమిట్రా? నువ్వు పంచకట్టు సవారీ ఎక్కిం తర్వాత ఏ రౌరవంలోకి వెళతావో తెలీదు కానీ, నువు చేసింది దౌర్భాగ్యపుపని అని పదిమందికీ తెలిస్తే మాత్రం నీకు ఈ భూమ్మీదనే పుట్టగతులుండవు. నీకేకాదు భూమ్మీద పౌరోహిత్యం చేసే ఏ బ్రాహ్మడికీ ఉండవు! అనేక కారణాలవల్ల పరమ పవిత్రమైన ఈ వృత్తి ఇప్పటికీ మళ్ళీ తేలిగ్గా కోలుకోలేనంతగా, తగలబడిపోయింది దానికి ఏ కొంచెమయినా గౌరవప్రపత్తులు జనంలో ఇంకా ఉన్నాయంటే, ఆ కాస్తీ మంటగలిపి పోవటానికి నీవంటివాళ్ళు కొంత దోహదం చేస్తున్నారు. ఎంతపని చేసావురా చండాలుడా!.. అసలయినా ఎవరూ పిలవకుండా నువ్వు వెళ్ళటమేమిటి? నా పేరు చెప్పటమేమిటి? విన్నా, విన్నా. విన్నవాళ్ళు ఏం చేసినా పాపం లేదురా భ్రష్టుడా!''

అసలే ఎర్రగా ఉండే శాస్త్రి మొహం కోపంతో ఇప్పుడు ప్రభాత కాలంలోని సూర్యబింబమయి పోయింది. ఆవేశంతో ఊగిపోతూ అతను వసారాలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు ఉండి. ఉండి మళ్ళీ అన్నాడు : ''అసలు, పందిట్లో పెళ్ళివాడు ఉంటే ఏం చేసేవాడివి?''

''వెదలకుండా శిక్ష అనుభవించేవాడిని. ఇతరుల దోషాలు పోగొట్టాలని నేను చేసే ప్రయత్నంలో దోషముందని ఆ ఇతరులే అనుకుంటే నేనేం చెయ్యగలనండి?''

''ఇతరుల దోషాలా, ఏమిటవి?'' శాస్త్రి గొంతులో కోపం తగ్గింది.


'అవునండీ మీరు వెళ్ళి పెళ్ళి చేయిస్తానని మాట ఇచ్చారు ఆఖరుక్షణంలో వెళ్ళలేనన్నారు ఆ విధంగా పీటలమీద పెళ్ళి ఆగిపోవటమనే దోషం మిమ్మల్ని చుట్టుకుంటోందిగదా? పైగా పెళ్ళి అట్లా ఆగిపోయే ఉంటే, పాపం, వెంకటరెడ్డి ఎంత తల్లడిల్లి పోయేవాడు! ఇంతేకాదు, మీ పట్ల అతనికి గల గౌరవం తగ్గి అతను మిమ్మల్ని నిందించటమనే దోషానికి ఒడిగట్టేవాడు కూడా గద! ఈ రెండు దోషాల్నీ నివారించగలిగితే, నేను చెయ్యబోయేది పెద్ద దోషం కాదనే నిర్ణయానికి వచ్చాను. నేను వెళ్ళి మంత్రాలే చదివానో, ఇంకేంచదివానో! కాని వెంకటరెడ్డికీ, అతని బంధువర్గానికీ తృప్తిగా మాత్రం శుభకార్యం పూర్తి చేయించిన వాణ్ణయ్యాను. వాళ్ళు నన్ను 'గురువుకు తగ్గ శిష్యుడవ'న్నారు. ఇవ్వదలుచుకున్న దక్షిణలన్నీ వాళ్ళు నా చేతికిచ్చి మీకు పంపిస్తామన్నారు నేను పుచ్చుకోలేదు. ఆ విషయం మీకు తెలిసే ఉంటుంది... ఇప్పుడు చెప్పండి గురువుగారూ, రెండు పెద్ద దోషాల్ని నివారించటం కోసం ఒక చిన్న దోషాన్ని- అది దోషమనే విషయం మీకూ నాకూ మాత్రమే తెలుసు. వాళ్ళెవ్వరికీ ఈ రకమైన అలోచనే అసలే దు- ఆచరించటం తప్పంటారా? తప్పే అయితే ఆ ఫలితం అనుభవించటానికి నేను సిద్ధంగా ఉన్నానండి!''

కంఠార్కశాస్త్రి నిశ్శబ్దుడై శేషయ్య మొహంలోకి తీక్షణంగా చూస్తూ ఉండిపోయాడు క్రమంగా మొహంలో ప్రసన్నత చోటు చేసుకుంటూండగా అన్నాడు :

''చూడబోతే నా గౌరవం కాపాడబడటం కన్నా, నీకు వెంకటరెడ్డి ఇంట్లో పెళ్ళి ఆగకుండా సాగిపోవాలన్నదే ముఖ్యంగా కనిపిస్తోందే!''

శేషయ్య తల వంచుకున్నాడు నెమ్మదిగా అన్నాడు : ''అవ్వచ్చునండి. దారి చూపవలసిన వాళ్ళే మాట తప్పితే, వెంకటరెడ్డి వంటి అనాగరికుల పరిస్థితి ఏమికానండి?''

''సరే కష్టాల్లో ఉన్నవాళ్ళను ఆదుకోవటమనే లక్షణం నీలో ఉంది సంతోషం. ఇప్పుడీ దక్షిణలో నీ వాటా నువ్వు తీసుకో. డబ్బు సగం, ధాన్యం సగం,...''



# ధర్మపథం

## సంకల్పసిద్ధి

పుణ్య స్థలాలు దర్శించినా, పవిత్ర నదీ జలాలలో స్నానం చేసినా పుణ్యం లభిస్తుందనీ, దానివల్ల ఉత్తమ గతులను పొందవచ్చుననీ పారలౌకికాసక్తి ఉన్నవారి అభిప్రాయం. అందువల్లనే అట్టి వారు సంసారంలో మునుగుతూ తేలుతూ ఉన్నా, ఏదో అవకాశం కల్పించుకొని పుణ్యక్షేత్రాలు సేవించి కొంతవరకూ సంతృప్తి పడతారు. కొందరికి అట్టి అవకాశం దొరకదు. మనస్సులో దృఢమైన సంకల్పం ఉన్నప్పుడు అది సఫలం కాకపోయినా సఫలమైనట్లే భావించాలని చెప్తారు. ఉదాహరణకు ఒక శ్లోకం

"అహం కాశీం గమిష్యామి
తత్రైవ నివసామ్యహమ్,
ఇతి బ్రువాణః సతతం
కాశీవాస ఫలం లభేత్."

"నేను కాశీకి వెళ్ళగలను. అక్కడనే నివసించగలను" అనే కోరికతో ఎప్పుడూ అనుకునేవాడు- "తన కోరిక నెరవేరక పోయినా కాశీవాస ఫలాన్ని పొందుతాడు" అని దీని అభిప్రాయం. అట్టి సంకల్పం ఉన్నవారికి నిరాశనూ, నిరుత్సాహాన్నీ కల్గించకుండా ఉండడానికి దీన్ని చెప్పి ఉండవచ్చు.

ఒక గృహస్థు సంసార బాధల నుండి తప్పించుకొని తీర్థయాత్రవల్ల కొంత మనశ్శాంతిని, పుణ్యాన్ని సంపాదించ దలచి, ఎలాగో శ్రమపడి కొంత డబ్బు చేర్చుకుని ప్రయాణానికి సిద్ధమయేవాడు. మంచి ముహూర్తం కూడా నిర్ణయించుకునేవాడు. కానీ ప్రతిసారీ ఏదో ఒక ఆటంకం ఇంట్లో ప్రసవమో, శుభకార్యమో, రోగమో - ఏదో ఒకటి సంభవించి ప్రయాణం ఆగిపోతూ ఉండేది. అతని మనస్సు కెంతో కష్టమనిపించేది. ఆతురత అధికమయ్యేది. ఏమయినా సరే మర్నాడు ప్రయాణమై తీరుతానని ఒకసారి దృఢంగా నిశ్చయించుకొని, సర్వ సన్నాహాలూ చేసుకుని రాత్రి నిద్రపోయాడు.

ఆ రాత్రి స్వప్నంలో తాను కాశీకి వెళ్ళినట్లు, గంగలో స్నానం చేసి, విశ్వేశ్వరుని గుడికి పోయి మహాదేవుని దర్శించినట్లు కనబడింది. కలలోనే ఇది స్వప్నమేమో అనే సందేహం కలిగింది. కాని గుడి గంటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తుండగా స్వప్నం అనుకోవడమెలా అని తీర్మానించుకున్నాడు. ప్రయాగలో త్రివేణీ సంగమంలో మునిగాడు. గయలో విష్ణుపాదాల్ని చూశాడు. మెలకువ వచ్చేసరికి తెల్లవారుతున్నది. అంతా స్వప్నమే అని తెలిసింది.

అయినా అతనికి సంతృప్తి గాని అసంతృప్తి కల్గలేదు.

ఏదో ఆటంకం వల్ల మరి ప్రయాణం కుదరలేదు.

"ఏ ఆటంకాలూ ఏమేమి చేస్తాయి? నా సంకల్పం నెరవేరనే నెరవేరింది" అని అనుకుని నిర్విచారంగానే ఉన్నాడు. సంకల్పమే అతనికి సంతృప్తి కల్గించినది.

—బులుసు వెంకటరమణయ్య

"క్షమించండిగురువుగారూ! మీరన్నట్లు ముఖ్యంగా వెంకటరెడ్డి కోసమే నేను వెళ్ళినా, అంతా మీ పేరుమీదనే నిర్వహించాను కనక ఇందులో నాకు చెందవలసిం దేమీలేదు. అన్నట్టు... అమ్మగారి కెట్లా ఉందండి?"

"తగ్గిందిలే... మీ పిననాన్నగారికెట్లా ఉంది?"

"ఆయన పోయారండి. ఆయనకు కొడుకులున్నారు కానీ, వాళ్ళకు ఏ చదువూ రాదండి ఆయన కుటుంబ భారం కూడా నా నెత్తినే పడిందండి."

"అరెరె! . మరి ఇంక మీ కిప్పుడు ఆధారమేమిటి?"

"ఇదిగో ఈ రాగిచెంబు" శేషయ్య తను కప్పుకున్న తుండు కిందనుంచి ఒక రాగి చెంబు తీసి చూపించాడు. గొంతు గద్గదికమవ్వగా అన్నాడు : "ఊళ్ళో వాళ్ళంతా చల్లగా ఉండాలే గాని, నాకు రోజుకో చెంబుడు బియ్యం భిక్ష దొరకదంటారా? వెళ్ళొస్తానండి బాబుగారూ ఇప్పటికే ఒక్క వీధికూడా అవ్వలేదు" శేషయ్య వసారా మెట్లు దిగి వీధి గుమ్మంవైపు నడిచాడు.

శేషయ్య వీధి గుమ్మం చేరే అయిదారు క్షణాల్లో శాస్త్రి ముఖ కవళికలు కూడా అయిదారు రకాలుగా మారాయి.

తొందరగా ఒక నిశ్చయాని కొచ్చేసాడు కంఠార్క శాస్త్రి.

కంగారుగా, ఆత్మీయత నిండిన గొంతుతో అన్నాడు : 'వెళ్ళకు నాయనా వెళ్ళకు. పట్టుదల, త్యాగబుద్ధి, లౌక్యం, దోషాదోష విచక్షణ వగైరా, ఒక మంచి పురోహితుడి కుండవలసిన లక్షణాలన్నింటినీ నీలో నేను చూస్తున్నాను. నువ్వు ఆయుస్సులో అల్పుడవైనా, ఆదర్శంలో అధికుడివి. మగ సంతానంలేని నేను, నా తర్వాత వాణ్ణిగా సమాజానికి ఎవర్ని అప్పజెప్పటమా అని ఇన్నాళ్ళుగా మథన పడుతున్నాను. ఇన్నాళ్ళకు నువ్వు దొరికావు. రా నాయనా, రా నా విద్యనంతా నీకు ధారపోసి, నన్ను మించినవాణ్ణి చేస్తాను. అదే గురుదక్షిణ ఉంది సుమా! జీవించటం కోసమే వృత్తి చెయ్యటం కాకుండా, ఎట్టి వర్గభేదమూ పాటించకుండా సమాజంలోని అన్నివర్గాల వారికీ సమంగా హితం కోరుతూ, నీ చేతనైనంతగా అందరిలోనూ ధర్మాసక్తిని కలిగిస్తూ, ఎంత గౌరవాన్నయితే ఈ వృత్తికి సంపాదించి పెట్టగలవో, అదంతా నాకు గురుదక్షిణే నాయనా! చూస్తాను, నా ఋణం తీర్చుకోవటానికి ఎంత చెల్లింపు చేస్తావో,...అట్లా ఆశ్చర్యపోతూ నిలబడి పోయావే? రా నాయనా, రా. కాళ్ళు కడుక్కొనికూర్చో. ఆచమించు. ఇప్పుడే ప్రారంభిద్దాం..."

* * *

"ఓం సహనావవతు, సహనౌ భునక్తు .. శాంతిః శాంతిః శాంతిః" - పదినిముషాల తర్వాత, సమాజంలో అంతరిస్తున్న ధార్మిక భావనను జాగృతంచేసి పరిరక్షించటానికై ఒక యువహృదయానికి ధర్మదీక్ష నివ్వటానికి ఉద్యుక్తుడయ్యాడు ఒక వృద్ధ ధర్మమూర్తి!